సాక్షి
రంగారెడ్డి
మంగళవారం । 25 । జూన్ । 2024



తలకొండపల్లి: మెదక్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో పెచ్చులూడిన పైకప్పు



ఇబ్రహీంపట్నం: వెంకటరమణకాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో పిచ్చిమొక్కల మధ్య మరుగుదొడ్లు

ఏళ్ల తరబడి

'రండి సర్కారు బడుల్లో సకల సౌకర్యాలు కల్పిస్తున్నాం.. అన్నీ ఉచితమే' అంటూ ప్రచారాలతో ఊదరగొట్టిన అధికారులు ఈ మేరకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఏళ్లతర'బడి' సమస్యలు అపరిష్కృతంగానే ఉన్నాయి. ఎక్కడ చూసినా భవనాలు శిథిలావస్థకు చేరుకోవడం.. ప్రహరీలు సరిగా లేకపోవడం.. కొత్త భవనాలు, అదనపు తరగతి గదుల నిర్మాణాలు అసంపూర్తిగా మిగిలిపోయి దర్శనమిస్తున్నాయి. పాఠశాలల ఆవరణలో ముళ్ల పొదలు పెరిగిపోయి.. చెత్త పేరుకుపోయి పరిసరాలు అధ్వానంగా మారాయి. మరుగుదొడ్లు కంపు కొడుతున్నాయి. ఇవన్నీ సోమవారం 'సాక్షి' జిల్లాలోని పలు పాఠశాలలను విజిట్ చేయగా కనిపించిన దృశ్యాలు. అరొకర సౌకర్యాల మధ్య విద్యార్థులు విద్యాభ్యాసం సాగిస్తున్నారు.

సాక్షి విజిట్



శంకర్‌పల్లి: ఉర్దూ పాఠశాలలో శిథిలావస్థకు చేరిన మరుగుదొడ్లు



ఆమనగల్లు: బాలికల ఉన్నత పాఠశాల వెనుకభాగంలో ఎత్తు తక్కువగా ఉన్న ప్రహరీ, పేరుకుపోయిన చెత్త



నందిగామ: నసరుల్లాబాద్ పాఠశాలలో బాత్‌రూంల పరిస్థితి



మొయినాబాద్‌రూరల్: ఎన్కెపల్లిలో దుర్వాసన భరించలేక ముక్కు మూసుకొని బాత్‌రూమ్‌కు వెళ్తున్న విద్యార్థులు



పహాడీషరీఫ్: జల్‌పల్లి పాఠశాలలో నిరుపయోగంగా మారిన మంచినీటి ట్యాంక్



కడ్తాల్: బాలుర ఉన్నత పాఠశాలలో ముళ్ల కంపల మధ్య మరమ్మతులకు నోచుకోని టాయ్‌లెట్స్



హయత్‌నగర్: జిల్లా పరిషత్ పాఠశాలలో అర్ధంతరంగా నిలిచిపోయిన డైనింగ్ హాలు నిర్మాణం

పూర్తి వివరాలు 8వ పేజీలో..

న్యూస్‌రీల్

ఉపాధ్యాయ బదిలీలపై విచారణ జరిపించండి



మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న కోర్ కమిటీ సభ్యులు

ఇబ్రహీంపట్నం రూరల్: జిల్లాలో జరిగిన ఉపాధ్యాయ బదిలీల్లో అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలని సేవ్‌రంగారెడ్డి జిల్లా ఉద్యమ సంస్థ కోర్ కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును కలిసి వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా కమిటీ నాయకులు మాట్లాడుతూ.. జిల్లాకు అక్రమంగా వచ్చిన వారిని ఆయా జిల్లాలకు తిరిగి పంపించాలని కోరారు. ఉపాధ్యాయులకు న్యాయం చేయాలన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు స్పందించి విచారణ జరిపిస్తామని చెప్పారని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పొనగంటి మహిపాల్‌రెడ్డి, బి.మధుకర్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, సునీత, మాధురి, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మీర్‌పేట డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాసం



కలెక్టర్ శశాంకకు అవిశ్వాసం లేఖను అందజేస్తున్న కార్పొరేటర్లు

మీర్‌పేట: మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి (బీఆర్‌ఎస్)పై అవిశ్వాసం ప్రకటిస్తూ బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన కార్పొరేటర్లు సోమవారం కలెక్టర్ శశాంకను కలిసి లేఖ అందజేశారు. 31 మంది సంతకాలు పెట్టి కలెక్టర్‌కు ఇచ్చినట్లు సమాచారం. గతంలోనూ బీఆర్‌ఎస్ మేయర్‌పై అవిశ్వాసం ప్రకటించినప్పటికీ చివరి నిమిషంలో సరిపడా బలం లేక వీగిపోయిన విషయం విదితమే.

ప్రజలతో మమేకం కావాలి

రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్



షాబాద్ ఠాణాలో మాట్లాడుతున్న రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్

షాబాద్: శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలతో మమేకమవ్వాలని రాజేంద్రనగర్ డీసీపీ సీహెచ్ శ్రీనివాస్ పేర్కొన్నారు. షాబాద్ ఠాణాను సోమవారం చేవెళ్ల ఏసీపీ కిషన్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందితో మాట్లాడి శాంతిభద్రతల పరిస్థితిని సమీక్ష నిర్వహించారు. అనంతరం మాటాడుతూ.. షాబాద్ మండల పరిధికి సరిపడా సిబ్బంది, వనరులు లేనట్లు గుర్తించినట్లు తెలిపారు. త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామన్నారు. మండలంలోని హైతాబాద్, సీతారాంపురంలో పారిశ్రామికవాడలు ఉండడంతో వివిధ రాష్ట్రాలకు చెందిన కార్మికులు ఇక్కడ నివాసాలు ఏర్పాటు చేసుకున్నారని.. నేరాలు పెరిగే ఆస్కారం ఉన్నందున దానిపై దృష్టి సారిస్తామని చెప్పారు. డీసీపీ వెంట సీఐ కాంతారెడ్డి, ఎస్‌ఐలు మహేశ్వర్‌రెడ్డి, నవీన్‌రెడ్డి తదితరులు ఉన్నారు

స్విమ్మింగ్‌పూల్‌లో మునిగి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మృతి

మీర్‌పేట: ప్రమాదవశాత్తు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ స్విమ్మింగ్ పూల్‌లో మునిగి మృతి చెందిన సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ రాంబాబు, స్థానికుల కథనం ప్రకారం. భీమవరానికి చెందిన శ్రీనివాసరావు కుమారుడు సంపత్ కుమార్ (26) టీసీఎస్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తూ మీర్‌పేట ఆర్‌ఎన్‌రెడ్డినగర్‌లోని ఓ ప్రైవేటు హాస్టల్‌లో స్నేహితులతో కలిసి ఉంటున్నాడు. వీకెండ్ కావడంతో ఈత కొట్టేందుకు ఆదివారం స్నేహితులతో కలిసి నాదర్‌గుల్‌లోని జీఎస్‌ఆర్ స్విమ్మింగ్‌పూల్‌కు వెళ్లాడు. స్విమ్మింగ్ చేస్తూ లోతు ఎక్కువగా ఉన్న చోటకు వెళ్లి మునిగిపోయాడు. స్నేహితులు గమనించే లోపే సంపత్‌కుమార్ పూర్తిగా మునిగిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు స్విమ్మింగ్‌పూల్ వద్దకు చేరుకుని మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈత రాకపోవడంతోనే సంపత్‌కుమార్ మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

- డిప్యూటీ డీఎంహెచ్‌ఓ దామోదర్



చేవెళ్లలోని పాలియేటివ్ కేర్ సెంటర్‌లో సిబ్బందితో సమావేశమైన డిప్యూటీ డీఎంహెచ్‌ఓ దామోదర్

చేవెళ్ల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకోసం తీసుకు వచ్చే ఆరోగ్య కార్యక్రమాలను ప్రజలు ఉపయోగించుకునేలా ఆరోగ్య కార్యకర్తలు, సిబ్బంది చూడాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ దామోదర్ అన్నారు. మండల కేంద్రంలోని డివిజన్ కార్యాలయంలో సోమవారం ఎంఎల్‌హెచ్‌పీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని సబ్‌సెంటర్ల పరిధిలో ఉండే ఎంఎల్‌హెచ్‌పీలు ఓపీ సేవలను ప్రతిరోజు నిర్వహించాలని సూచించారు. ఆయా గ్రామాల పరిధిలో ఉన్న గర్భిణులను పరీక్షించాలని చెప్పారు. ప్రతి మంగళ, శుక్రవారాలు ఆరోగ్య మహిళా కార్యక్రమం నిర్వహించి మహిళల ఆరోగ్య పరిస్థితులను సమీక్షించి అవసరమైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. ఏఎన్‌ఎంలు, ఆశాలతో క్షేత్రాస్థాయిలో విజిట్ చేయించాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని, వైద్యసేవలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సీహెచ్‌ఓలు గోపాల్‌రెడ్డి, సంతోష, ఎంపీహెచ్‌ఓ బలరాం, డివిజన్‌లోని ఎంపీహెచ్ ఓలు పాల్గొన్నారు. అనంతరం డిప్యూటీ డీంహెచ్‌ఓ దామోదర్ మండలకేంద్రంలోని పాలియేటివ్ కేంద్రంలో సమీక్ష నిర్వహించారు. వైద్య సిబ్బంది రోగుల పట్ల బాధ్యతతో మెలగాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని హెచ్చరించారు.

ఐటీ కారిడార్‌లో మెట్రో లగ్జరీ బస్సు

సాక్షి, సిటీబ్యూరో: ఐటీ ఉద్యోగులు, సాఫ్ట్‌వేర్ నిపుణుల కోసం ఐటీ కారిడార్‌కు రాకపోకలు సాగించేవిధంగా ఎలక్ట్రిక్ ఏసీ మెట్రో లగ్జరీ బస్సును ప్రవేశపెట్టినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఈ బస్సు (127కె) కోఠి నుంచి కొండాపూర్ వరకు ప్రతి 24 నిమిషాలకు ఒకటి చొప్పున నడుస్తుంది. కొండాపూర్ నుంచి మొదటి బస్సు ఉదయం 5.06 గంటలకు, చివరి బస్సు రాత్రి 10.17 గంటలకు బయలుదేరుతుంది. కోఠి నుంచి మొదటి బస్సు ఉదయం 6.16 గంటలకు, చివరి బస్సు రాత్రి 11.27 గంటలకు బయలుదేరుతుంది. ఈ బస్సు లక్డీకాపూల్, మాసాబ్‌ట్యాంక్, పెద్దమ్మగుడి, మాధాపూర్, హైటెక్‌సిటీ, కొత్తగూడ ఎక్స్‌రోడ్, ఐటీకారిడార్‌ల మీదుగా కొండాపూర్ వరకు చేరుకుంటుంది.

టెండర్ల ఆహ్వానం



మాట్లాడుతున్న ఆర్టీసీ రీజనల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ కుర్మయ్య

షాద్‌నగర్‌రూరల్: ఆర్టీసీ కాంప్లెక్స్‌లోని దుకాణ సముదాయాలకు టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు ఆర్టీసీ రీజనల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ కుర్మయ్య అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహబూబ్‌నగర్ రోడ్డువైపు ప్రస్తుతం ఉన్న ఆర్టీసీ దుకాణ సముదాయంపై మొదటి అంతస్తులో 11 షాపులను నూతనంగా నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ షాపులకు టెండర్లను పిలుస్తున్నట్లు చెప్పారు. అడ్వాన్స్ టెండర్లలో భాగంగా ఒక్కో దుకాణానికి రూ.2లక్షల డిపాజిట్ నిర్ణయించామని, ఆన్‌లైన్‌లో బిడ్స్ నిర్వహించడం జరుగుతుందన్నారు. టెండర్ వేసేందుకు ఈ నెల 26వ తేదీ మధ్యాహ్నం 2 గంటల వరకు గడువు ఉంటుందని తెలిపారు. హార్డ్ కాపీలను ఈ నెల 27న ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకుమహబూబ్‌నగర్‌లో రీజినల్ టెండర్ బాక్సులో వేయాలని సూచించారు. టెక్నికల్ బిడ్‌ను ఈ నెల 27న మధ్యా హ్నం 3గంటలకు తీయడం జరుగుతుందని, కమర్షియల్ బిడ్ ఈ నెల 28న ఉదయం 11గంటలకు ఓపెన్ చేయనున్నట్లు వివరించారు. మరిన్ని వివరాలకు 91009 98229, 99592 26285, 94406 77428 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. సమావేశంలో షాద్‌నగర్ డిపో మేనేజర్ ఉష, అసిస్టెంట్ మేనేజర్ సుధాకర్, డిపో సూపరింటెండెంట్ మోహనమూర్తి, స్టాల్ ఇన్‌చార్జి ఎంఎస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దళిత విద్యార్థిపై దాడి అమానుషం

- ఎస్సీ, ఎస్టీ రాష్ట్ర కమిషన్ మాజీ సభ్యుడు చిలకమర్రి నరసింహ



కాళ్లు, చేతులు కట్టేసి బాలుడిపై దాడి చేస్తున్న మధుసూదన్‌రెడ్డి

షాబాద్: దళిత విద్యార్థిపై దాడి చేసిన విశ్రాంత ఉపాధ్యాయుడిని వెంటనే అరెస్టు చేయాలని ఎస్సీ, ఎస్టీ రాష్ట్ర కమిషన్ మాజీ సభ్యుడు చిలకమర్రి నరసింహ డిమాండ్ చేశారు. సోమవారం రాత్రి విలేకరులతో మాట్లాడుతూ.. కేసారం గ్రామంలో శనివారం మధుసూదన్‌రెడ్డి తన ఇంట్లో ఉన్న జామ చెట్టుకు కాయలు తెంపుతున్నాడని ఓ మైనర్‌ని కాళ్ల చేతులు తాళ్లతో కట్టి బంధించి కొట్టడం దారుణం అన్నారు. అమానుషంగా ప్రవర్తించిన మధుసూదన్‌రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు షాబాద్ సీఐ కాంతారెడ్డి తెలిపారు.



జూడాల సమ్మెబాట

సాక్షి,సిటీబ్యూరో/గాంధీఆస్పత్రి/సుల్తాన్‌బజార్: జూనియర్ డాక్టర్లు సమ్మె బాట పట్టారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా విధులు బహిష్కరించారు. సమ్మె నోటీసులిచ్చినా ప్రభుత్వం స్పందించక పోవడంతో సోమవారం నుంచి సాధారణ విధులను బహిష్కరించారు. సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి, ఉస్మానియా వైద్య కళాశాల ప్రాంగణంలో బైఠాయించి ఆందోళన చేపట్టారు. కోఠిలోని ఉస్మానియా మెడికల్ కళాశాల ఆవరణలో పెద్దఎత్తున నిరవధిక సమ్మెలో పాల్గొన్నారు. ఔట్ పేషంట్ సేవలు, ఎలక్ట్రిక్ సర్జరీలు, ఇతరత్రా డ్యూటీలను బహిష్కరించారు. ఆరు నెలలుగా జూడాలకు ప్రభుత్వం స్టైపెండ్ ఇవ్వట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

సమస్యలు పరిష్కరించండి

కలెక్టరేట్ ఎదుట మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

ఇబ్రహీంపట్నం రూరల్: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు యెలమోని స్వప్న డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని, గౌరవ వేతనం ఇవ్వాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులకు ఇచ్చే మెనూ చార్జీలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. నెలల తరబడి బిల్లులు రాకపోవడంతో అప్పులు చేసి వంట చేయాల్సిన పరిస్థితి నెలకొందని, వడ్డీలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రమంతటా గృహలక్ష్మి పేరుతో గ్యాస్ సిలిండర్ రూ.500కు ఇస్తామని కాంగ్రెస్ ప్రకటించిందని, మధ్యాహ్న భోజనం కార్మికులకు ఆ స్కీం వర్తింపచేయాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రూ.10వేల వేతనం ఇవ్వాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న అన్ని బిల్లులు వారంలో చెల్లించకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

అనంతరం అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు కిషన్, పోచమోని కృష్ణ, ఈ.నర్సింహ, బుట్టి బాలరాజు, శ్రీను, అలివేలు, గణేశ్, సరిత, శిరిష, పద్మ, లక్ష్మమ్మ, భాస్కర్, మల్లారి, నవీనత, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని మహిళ మృతి


మహిళ మృతదేహం

ఇబ్రహీంపట్నం రూరల్: రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని మహిళ దుర్మరణం చెందింది. ఈ సంఘటన ఆదిబట్ల ఠాణా పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని బొంగ్లూర్ సరీ్వస్ రోడ్డులో ఓ గుర్తు తెలియని మహిళ(30) నడుచుకుంటూ వెళ్తుంది. ఈ క్రమంలో గుర్తు తెలియని వాహనం ఆమెను ఢీ కొట్టింది. దీంతో తీవ్ర గాయాల పాలైంది. రక్తం మడుగుల్లో ఉండగా స్థానికులు 108కి ఫోన్ చేయడంతో ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మార్గ మధ్యలోనే ఆమె మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. సదరు మహిళ పింక్ కలర్ ప్యాంట్‌తో రెడ్ చెక్‌ల కుర్తా ధరించి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బాలిక కిడ్నాప్‌నకు యత్నం

నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు

పహాడీషరీఫ్: బాలికను కిడ్నాప్ చేసేందుకు యత్నించిన నిందితుడిని పహాడీషరీఫ్ పోలీసులు అరెస్ట్ చేసి సోమవారం రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జల్‌పల్లి శ్రీరాం కాలనీకి చెందిన నాలుగేళ్ల చిన్నారి ఆదివారం సాయంత్రం ఇంటి ముందు ఆడుకుంటుంది. ఈ సమయంలో అటుగా వచ్చిన బిహారీ యువకుడు కునాల్ రామ్(34) బాలికను తీసుకొని వెళుతున్నాడు. కొద్ది దూరంలోని దుకాణ యజమాని బాలికను గుర్తించి ఎక్కడికి తీసుకెళుతున్నావని ప్రశ్నించగా, నిందితుడు పారిపోయేందుకు యత్నించగా స్థానికులు పట్టుకొని పోలీసులకు సమాచారం అందించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని సోమవారం రిమాండ్‌కు తరలించారు. కాగా ఇదే కాలనీలో వారం రోజుల క్రితం కూడా ఓ ఆరేళ్ల బాలుడిని యూపీకి చెందిన యువకుడు డబ్బులు డిమాండ్ చేసేందుకు కిడ్నాప్ చేసిన విషయం తెలిసిందే. పోలీస్ అధికారులు ఇప్పటికైనా స్పందించి కాలనీలో నివాసం ఉంటున్న ఇతర రాష్ట్రాల ప్రజల వివరాలు సేకరించి, వారి నేర చరిత్రపై కూడా కన్నేసి కిడ్నాప్‌లు జరగకుండా నిఘాను ముమ్మరం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఏళ్ల తరబడి.. అదే ఒరవడి!

సరస్వతీ నిలయాలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేస్తామని పాలకులు, అధికారులు చెబుతున్నా.. ఆచరణలో పెట్టలేకపోతున్నారు. ఫలితంగా విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది సౌకర్యాల లేమితో సతమతమవుతున్నారు. వసతుల కల్పనకు సర్కారు కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నా.. ఎక్కడ వేసిన గొంగళి అక్కడేఅన్న చందంగా మారింది. ఇక ఉపాధ్యాయుల సంగతి సరేసరి. సమయపాలన పాటించకపోవడంతో పిల్లలూ వారినే అనుసరిస్తున్నారు. విద్యాబుద్ధులు నేర్పాల్సిన వారు వ్యవహరిస్తుండగా.. పర్యవేక్షించాల్సిన విద్యాధికారులు మౌనం దాలుస్తున్న తీరుపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. సోమవారం ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని సర్కారు బడులను 'సాక్షి' విజిట్ చేయగా.. అనేక విషయాలు వెలుగు చూశాయి..

వసతుల లేమితో విద్యార్థులు సతమతం

- పాఠశాలల్లో మరుగు దొడ్లు లేక.. ఆరు బయటకు పరుగు
- బడికి ఎప్పుడైనా పోవచ్చన్న ధోరణిలో ఉపాధ్యాయులు
- వారినే అనుసరిస్తున్న పిల్లలు
- నన్నగిల్లుతున్న విద్యాప్రమాణాలు.. పట్టించుకోని విద్యాధికారులు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మండల పరిధిలో 47 (14 ఉన్నత, 7 ప్రాథమికోన్నత, 26, ప్రాథమిక పాఠశాలలు) ఒక కేజీబీవీ, ఒక ఆదర్శ పాఠశాలలు ఉండగా.. వాటిలో 5,158 మంది విద్యనభ్యసిస్తున్నారు. ఆ బడుల్లో 235 మంది ఉపాధ్యాయులు పనిచేస్తుండగా.. మరో 12 ఖాళీలు ఉన్నాయి. కొన్ని గ్రామాల్లో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండగా.. మరికొన్ని ప్రాంతాల్లో టీచర్ల కొరత వేధిస్తోంది. స్కావెంజర్లు, వాచ్‌మెన్, ప్రహరీలు లేక విద్యార్థులు, ఉపధ్యాయులు ఇబ్బంది పడుతున్నారు. పట్నంలోని వెంకటరమణాకాలనీ సర్కారు బడి ప్రాంగణం పిచ్చి మొక్కలతో నిండి ఉంది. ప్రహరి లేక కుక్కలు, పందుల బెడదతో పాటు విష సర్పాలు సంచరిస్తున్నాయి. అపరి శుభ్రతతో ఉన్న మరుగుదొడ్లను వినియోగించుకోవడానికి విద్యార్థులు అయిష్టత చూపుతున్నారు. ముకునూర్ పాఠశాలలో ఓ పక్క ప్రహరి కూలిపోయింది. ఇబ్రహీంపట్నం ఉర్దు మీడియం పాఠశాల, ప్రాథమికోన్నత పాఠశాలల్లోని పలు తరగతి గదులు శిథిలావస్థకు చేరాయి. అమ్మ ఆదర్శ కమిటీల కింద మండల పరిధి 24 పాఠశాలలు ఉండగా.. అభివృద్ధి పనులు పూర్తి కావొచ్చాయి. అన్ని సర్కారు బడులకు 90 శాతం పాఠ్య,నోట్ పుస్తకాలు, ఒక్కో జత యూనిఫాంను పంపిణీ చేశారు. మరో జత ఆగస్టులోపు ఇవ్వనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.


ఇబ్రహీంపట్నం: వెంకటరమణాకాలనీ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలు (ఇన్‌సెట్లో)


ప్రహరీ లేని పాఠశాల

శిథిలావస్థలో పాఠశాలలు

యాలాల: మండలంలో 10 ఉన్నత, 50 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. ఈ ఏడాది 30వేల పైగా పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు పాఠశాలలకు చేరాయి. ఆయా స్కూళ్లల్లో అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో మరమ్మతు పనులు కొనసాగుతూనే ఉన్నాయి. సరిపడా ఉపాధ్యాయులు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గిరిజన తండాల్లో ఈ ఈ సమస్య ఎక్కువగా ఉంది. 1 నుంచి 5 తరగతులకు ఒకే ఉపాధ్యాయుడితో పాటు గదులు కొరత తీవ్రంగా వేధిస్తోంది. చాలా బడుల్లో గదులు, భవనాలు బీటలువారి, వర్షాలకు పైకప్పులు తడుస్తుండటంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మధ్యాహ్న భోజన విషయంలో నాణ్యతా ప్రమాణాలు అంతంతా మాత్రంగానే ఉంటున్నాయి. మెడికల్ కిట్లు లేవు. బడుల్లో చేపట్టిన మరమ్మతు పనుల్లో నాణ్యతతో పాటు ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడటంతో.. పనులు నెమ్మదించాయి.

మరుగుదొడ్లున్నా.. శుభ్రం సున్నా..


పాఠశాల ఆవరణలో పిచ్చిమొక్కలు

ఆమనగల్లు: ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో పాఠశాలల్లో అభివృద్ధి పనులను చేపట్టినప్పటికీ.. ఇంకా చాలా బడుల్లో పూర్తికాలేదు. మండలంలో 29 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. మండలంలో 5 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 6 నుంచి 10 తరగతులు కొనసాగుతుండగా.. 390 మంది విద్యనభ్యసిస్తున్నారు. 22 మంది ఉపాధ్యాయులు ఉండగా.. ఇటీవల నలుగురు టీచర్లు బదిలీ అయ్యారు. పాఠశాలలో విద్యార్థులు ఇతర అవసరాలకు బోరు నీటిని వాడుతున్నప్పటికీ.. తాగడానికి నీరు లేక ఇబ్బంది పడుతున్నారు. మూత్రశాలలు, మరుగుదొడ్లు ఉన్నా.. వాటిని శుభ్రం చేయడానికి స్కావెంజర్ లేరు. అప్పుడప్పుడు మున్సిపాలిటీ సిబ్బంది శుభ్రం చేస్తున్నారు. కొన్నేళ్లుగా అటెండర్, వాచ్‌మెన్, స్వీపర్ పోస్టులు ఖాళీగా ఉండటంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వాచ్‌మెన్ లేక పోవడంతో.. ఆకతాయిలు పాఠశాల ఆవరణ, మరుగుదొడ్ల మాటున ఉంటూ.. విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని, వెంటనే వాచ్‌మెన్‌ను నియమించడంతో పాటు.. పాఠశాల వెనుకభాగంలో ప్రహరి ఎత్తును పెంచాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

తరగతి గదిలోనే వంట


బుద్దారం బడి తరగతిలో వంట సామగ్రి

పెద్దేముల్: సర్కారు బడుల్లో వసతులు కొరవడి విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో సెలవుల దినాల్లో పాఠశాలల్లో అభివృద్ధి పనులు ప్రారంభించారు. కానీ.. విద్యా సంవత్సరం ప్రారంభమైనా.. క్షేత్రస్థాయి బడుల్లో పనులు పూర్తి కాలేదు. మండల పరిధి కర్ణాటక సరిహద్దు గిరిజన పాఠశాలలు అధ్వానంగా ఉన్నాయి. 1నుంచి 5 తరగతులను ఒక్క ఉపాధ్యాయుడే బోధిస్తున్నారు. ఆ టీచర్ అత్యవసర సమయంలో సెలవు పెడితే విద్యార్థులకు తీవ్ర నష్టం తప్పదు. గాజీపూర్ పాఠశాలకు ప్రహరి, బుద్దారం, ఊరేంటితండా బడులకు వంట గదులు లేక, క్లాస్ రూముల్లో వంట చేస్తున్నారు. బాయిమీదితండా, జైరాం తండా, ఉఘానాయక్‌తండాల ఐదు తరగతులకు ఒక్కరే టీచర్. బడులు తెరిచి పది రోజులు గడుస్తున్నా.. నేటికీ 40శాతం వరకు ఏకరూప దుస్తులు సరఫరా అయినట్లు ప్రధానాపోధ్యాయుల ద్వారా తెలుస్తోంది.

సమయపాలన పాటించని టీచర్లు


బండివాడ సీపీఎస్ పాఠశాలలో విద్యార్థులు లేక ఒంటరిగా కూర్చున్న ఉపాధ్యాయుడు

దౌల్తాబాద్: విద్యా వ్యవస్థ దయనీయంగా మారింది. పాఠశాలల్లో వసతుల లేమితో పాటు ఉపాధ్యాయుల పనితీరు సక్రమంగా లేదంటూ విమర్శలు వస్తున్నాయి. మండల పరిధి బండివాడ పాఠశాలలో ఉదయం 9గంటలకు ప్రార్థన చేయాల్సి ఉండగా.. ఇక్కడి ఉపాధ్యాయులు తీరిగ్గా 9.40నిమిషాలకు బడికి వస్తారు. వీరి ఆలస్యం కారణంగా ఉన్న నలుగురు విద్యార్థులకు ఒక్కరూ రాలేదు. తిమ్మారెడ్డిపల్లిలో ఐదుగురు టీచర్లు ఉండగా.. ఒకరు డిప్యుటేషన్ వెళ్లారు. మరొకరు సెలవు పెట్టారు. ఏడు తరగతులకు గాను ముగ్గరే పాఠాలు బోధిస్తున్నారు. పాఠశాల, సిబ్బంది పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన విద్యాధికారులు.. పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. బాలంపేట ఉన్నత పాఠశాలలో బాలికలకు మూత్రశాలలు అధ్వానంగా ఉన్నాయి. వంటగదులు లేకపోవడంతో మధ్యాహ్న భోజన నిర్వాహకులు ఆరుబయటే వండుతున్నారు.

స్కావెంజర్ల కొరత.. వేధిస్తున్న అపరిశుభ్రత


తరగతి గదిలో విద్యార్థులతో ఉపాధ్యాయుడు

చేవెళ్ల: మండల పరిధి ఆలూరు జెడ్పీహెచ్ఎస్‌లో 6 నుంచి 10వ తరగతి వరకు తరగతులు కొనసాగుతున్నాయి. జిల్లా పరిషత్ బాలికల, ప్రాథమిక పాఠశాలలు ఇక్కడే ఉన్నాయి. ఒకే ప్రాంగణంలో మూడు బడులు కొనసాగుతున్నప్పటికీ.. విద్యార్థుల సంఖ్య నామమాత్రంగానే ఉంది. సరిపడా ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ.. ఏ క్లాస్‌లోనూ పూర్తిస్థాయిలో విద్యార్థులు లేరు. మొత్తం ఇక్కడ 110 మంది విద్యార్థులకు గాను 96 మంది హాజరయ్యారు. 6వ తరగతికి ప్రవేశాలు జరుగుతున్నందున కొత్తగా వచ్చేవారికి కావాల్సిన పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు అందించాల్సి ఉంది. మధ్యాహ్న భోజనం వండే వారు లేక.. అక్షయపాత్ర సంస్థ ద్వారా విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. బాలబాలికలకు వేరువేరుగా మరుగుదొడ్లు కావాల్సి ఉంది. అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో బాలికల టాయిలెట్ల నిర్మాణం చేపట్టారు. కానీ స్కావెంజర్లు లేక అపరిశుభ్రత వాతావరణ నెలకొంది. అంటెండర్లు, కిందిస్థాయి సిబ్బంది లేకపోవటంవతో తరగతి గదులను జీపీ సిబ్బందితో శుభ్రం చేయిస్తున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

ఖాళీ పోస్టులతో అవస్థలు

తలకొండపల్లి: సౌకర్యాల లేమితో ప్రభుత్వ పాఠశాలలు కొట్టుమిట్టాడుతున్నాయి. టీచర్లు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. మండల పరిధిలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 52 ఉన్నాయి. వీటిల్లో 234 మంది ఉపాధ్యాయులు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 106 మంది మాత్రమే ఉన్నారు. 28 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ బడుల్లో 2,219 మంది చదువుతుండగా అందరికీ ఒక జత యూనిఫామ్స్ పంపిణీ చేశారు. రెండో జతను త్వరలో పంపిణీ చేయనున్నట్లు ఎంఈఓ సర్దార్‌నాయక్ తెలిపారు. పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. మనఊరు–మనబడి పథకం కింద రూ.3,71,93,576 నిధులు మంజూరు కాగా.. రూ.51,94,015 మాత్రమే ఖర్చు చేశారు. చంద్రధన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అదనపు గదుల నిర్మాణం అసంపూర్తిగా మిగిలిపోయింది. స్లాబ్ వేసి వదిలేశారు. చుక్కాపూర్ ఉన్నత పాఠశాలలో గదులు నిర్మాణం కోసం రూ.74 లక్షలు మంజూరు కాగా, ఇప్పటి వరకు టెండర్లు పూర్తి కాలేదు. రాంపూర్ ఉన్నత, చీపునుంతల ప్రాథమిక పాఠశాలల్లో ప్రహరీలు లేవు. తలకొండపల్లి ప్రాథమిక పాఠశాలలో వంట గది లేదు. శిథిలమైన గదిలోనే వంట చేస్తున్నారు. చంద్రధన ప్రాథమిక పాఠశాలకు వంట గది అవసరముంది. మెదక్‌పల్లి ప్రాథమిక పాఠశాల పూర్తిగా శిథిలమైపోయింది. 3 అదనపు గదులు నిర్మించాల్సి ఉంది. అమ్మ ఆదర్శ పాఠశాల నిధుల కింద 9 బడులకు 8,91,000 మంజూరు కాగా.. 100 శాతం నిధులు ఖర్చు చేసి మరమ్మతులు చేశారు.

13 పాఠశాలల్లో కిచెన్ షెడ్లు నిల్

కందుకూరు: మండల పరిధి 13 ప్రభుత్వ పాఠశాలల్లో (గుమ్మడవెల్లితండా, మాలగూడ, ముచ్చర్ల, చీమలవానికుంట, జబ్బార్‌గూడ, దావూద్‌గూడ, దాసర్లపల్లి తండా, శ్యామగడ్డ, అగర్‌మియాగూడ, పులిమామిడి, ధన్నారం (ప్రాథమిక, బేగంపేట, మాన్యగూడ) కిచెన్ షెడ్లు లేవు. దీంతో ఆరు బయట లేదా వరండా, తరగతి గదుల్లో వంట చేయాల్సిన దుస్థితి. కందుకూరు చౌరస్తాలోని ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ లేదు. అన్ని పాఠశాలల్లో 4,512 మంది విద్యనభ్యసిస్తుండగా.. 75 నుంచి 80 శాతం మాత్రమే హాజరవుతున్నారు. మెడికల్ కిట్లు, న్యాప్‌కిన్స్ సరఫరా లేదు. ప్రస్తుతం అన్ని పాఠశాలకు తాగునీరు సరఫరా ఉంది. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా అన్ని బడులకు స్టెయిన్‌లెస్ స్టీల్ ట్యాంకుల ఏర్పాటుకు ఆర్డర్ ఇచ్చినట్లు అధికారులు తెలిపారు.

"వాచ్‌మెన్‌ను నియమించాలి



బాలికల ఉన్నత పాఠశాలలో వెంటనే వాచ్‌మెన్‌ను నియమించాలి. పాఠశాల వెనుకభాగంలో ప్రహరీ ఎత్తు తక్కువగా ఉండటంతో గుర్తుతెలియని వ్యక్తులు పాఠశాలలో చొరబడుతున్నారు. మూత్రశాలలో దాక్కుని భయపెడుతున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేశాం. చర్యలు తీసుకోండి. విద్యార్థినులకు రక్షణ కల్పించండి.

– సంధ్య, 10వ తరగతి, బాలికల ఉన్నత పాఠశాల, ఆమనగల్లు

మెడికల్ కిట్ల పంపిణీ లేదు

పహాడీషరీఫ్: జల్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో 280 మంది విద్యార్థులకు ఎనిమిది మంది ఉపాధ్యాయులు ఉన్నారు. సాంఘిక శాస్త్రం, పీఈటీ పోస్ట్ ఖాళీగా ఉంది. వాచ్‌మెన్ లేకపోవడంతో రాత్రి పూట తక్కువ ఎత్తులో ఉన్న ప్రహరీ నుంచి ఆకతాయిలు పాఠశాలలోకి చొరబడుతూ.. విలువైన వస్తువులను అపరిస్తున్నారు. ఆయా, స్వీపర్ లేకపోవడంతో పాఠశాల పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటున్నాయి. వాటర్ ట్యాంకు నల్లాలు మరమ్మతుకు నోచుకోవడంతో నీరు వృథాగా పోతోంది. విద్యార్థులకు మెడికల్ కిట్ల పంపిణీ లేదు.

కొన్ని స్కూళ్లకే ప్రహరీలు


ప్రహరీ లేని బాలుర ఉన్నత పాఠశాల

కడ్తాల్: మండల పరిధి ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు తిష్టవేశాయి. మనఊరు–మనబడి కింద కొన్ని పాఠశాలలో అభివృద్ధి పనులు చేశారు. అమ్మ ఆదర్శ పథకం కింద పనులు చేపట్టారు. దీని ద్వారా కొన్ని పాఠశాలల్లో మౌలిక సమస్యలు తీరుతున్నా, మరికొన్నింటిలో అలాగే ఉన్నాయి. ఆదర్శ పాఠశాలల పథకం కింద 12 పాఠశాలలను ఎంపిక చేశారు. వీటిల్లో వాస్‌దేవ్‌పూర్, గడ్డమీదితండా, అన్మాస్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో అభివృద్ధి పనులు అసంపూర్తిగా ఉన్నాయి. మండల పరిధి ప్రాథమిక పాఠశాలలకు ఎక్కడా ప్రహరీలు లేవు. కిచెన్ షెడ్లు కొన్ని పాఠశాలల్లో ఉన్నా.. మరికొన్నింట్లో లేవు. ప్రధానంగా మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలకు నేటికీ ప్రహరీ లేదు. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులకు యూనిఫాంలు, పుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. మక్తమాధారం ప్రాథమికోన్నత పాఠశాలలో హిందీ పోస్ట్ ఖాళీగా ఉంది.

ప్రాణం తీసిన అజాగ్రత్త

- రోడ్డు ప్రమాదంలో మాజీ సర్పంచ్ దుర్మరణం
- మరో విద్యార్థినికి తీవ్ర గాయాలు

కందుకూరు: బాధ్యతారాహిత్యంగా కారును నడిపి ఓ నిండు ప్రాణాన్ని బలిగొన్న దుర్ఘటన కందుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఈ సంఘటనలో మాజీ సర్పంచ్ దుర్మరణం చెందగా, ఓ విద్యార్థినికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కడ్తాల్ మండలం ముద్విన్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఈర్లపల్లి యాదయ్య(47) సోమవారం ఉదయం బైక్‌పై హైదరాబాద్ వెళ్లారు. తిరుగు ప్రయాణంలో నగరంలోని సంతోష్‌నగర్‌లో ఓ కళాశాలలో చదువుతున్న తన ఇంటి పక్కన ఉండే విద్యార్థిని సంధ్యను బైక్‌పై ఎక్కించుకుని సాయంత్రం స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యలో కందుకూరు మండలం దెబ్బడగూడ గేట్ సమీపంలో శ్రీశైలం రహదారిపై ఎదురుగా అతి వేగంగా, అజాగ్రత్తగా వస్తున్న కారు వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న ఇద్దరు ఎగిరిపడగా.. యాదయ్య తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. విద్యార్థినికి తీవ్ర గాయాలయ్యాయి. బైక్ ట్యాంక్ పగిలి మంటలు అంటుకుని దగ్ధమయింది. కాగా కారులో మద్యం తాగడానికి ఉపయోగించే గ్లాసులు ఉన్నట్లు గుర్తించారు. ఆ కారు ముందు వెళ్తున్న వాహనాన్ని దాటే క్రమంలో పూర్తిగా కుడివైపు రాంగ్ రూట్‌లోకి వెళ్లి వీరి బైక్‌ను ఢీకొట్టింది. కాగా మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. విద్యార్థిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రైలు కింద పడి ఆత్మహత్యాయత్నం

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి

షాద్‌నగర్‌రూరల్: గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన రైల్వే పోలీసులు ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన పట్టణ శివారులోని కీర్తి వెంచర్ సమీపంలో సోమవారం ఉదయం చోటు చేసుకుంది. రైల్వే కానిస్టేబుల్ మల్లేశ్వర్ కథనం ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తి(35) గుంటూరు నుంచి కాచిగూడ వెళ్లే రైలుకు అడ్డంగా పట్టాల వెళ్లి ఆత్మహత్యాయత్నానికి పూనుకున్నాడు. ఈ ప్రమాదంలో తల, ముఖంపై తీవ్ర గాయాలై కింద పడిపోయాడు. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. పట్టాల పక్కన తీవ్రంగా గాయపడి ఉన్న వ్యక్తిని చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలు తెలియకపోవడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి శరీరంపై గోధుమ కలర్ టీ షర్టు, బ్లూ కలర్ నైట్ ప్యాంటు ధరించి ఉన్నాడు. ఎడమ చేతిపై లవ్ సింబల్ పచ్చబొట్టు ఉంది. మృతుడి వివరాలు తెలిసిన వారు వెంటనే రైల్వే పోలీసులకు సమాచారం అందించాలని కానిస్టేబుల్ కోరారు. కేసు దర్యాప్తులో ఉంది.